జూన్ నుంచి 'తాయుమానవర్'

● 5 లక్షల కుటుంబాలకు లబ్ధి


ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారీస్, మే 22: రాష్ట్రప్రభుత్వం ఐదు లక్షల కుటుంబాల అభివృద్ధి కోసం రూపొందించిన 'తాయుమానవర్' పథకం వచ్చే నెల నుంచి అమలు కానుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుచుకొని డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందేలా కొత్త పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అందులో 'నాన్ ముదల్వన్' పథకానికి ప్రజల మద్దతు బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో, గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించే విధంగా 'సీఎం తాయుమానవర్' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో 2024-25వ ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు రూ.27.922 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో దాదాపు 5లక్షల నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటపడే విధంగా ఈ పథకం తోడ్పడుతుందని ప్రకటించారు. వచ్చే నెల ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ పథకాన్ని ప్రారంభిస్తారని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువ భాగానికి చేరుకున్న కుటుంబాలను గుర్తించి వారి జీవనశైలిని మెరుగుపరచడమే ఈ పథకం లక్ష్యమని, ఆదరణ కోల్పోయిన వారు, కుటుంబానికి దూరమైన వృద్ధులు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, మానసిక వికలాంగులు, ఆటిజంతో బాధపడుతున్న పిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతారని అధికారులు తెలిపారు. వీరికి మౌలిక వసతులతోపాటు విద్య, ఉద్యోగావకాశాలు, ప్రతిభాపాటవాల అభివృద్ధి, ఇళ్లు లేని వారికి సొంత ఇల్లు పంపిణీ ఉంటుంది. ఈ పథకంలో ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, బ్యాంకుల ప్రాతినిధ్యం కూడా ఉంటుంది. తాయుమానవర్ పథకంలో లబ్ధిపొందనున్న పేద కుటుంబాలను గుర్తించడంపై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. వచ్చే జూన్ 4వ తేది లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ఈ పథకానికి సంబంధించిన నియమావళిని ప్రభుత్వం విడుదల చేస్తుందని అధికారులు తెలిపారు.

కోలాహలంగా వైకాశి విశాఖ ఉత్సవాలు

● మార్మోగిన తిరుచెందూర్ క్షేత్రం


తిరుచెందూర్ సముద్రతీరంలో భక్తుల సందడి

ప్యారీస్, మే 22: తమిళుల ఆరాధ్యదైవమైన సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ఒకటిగా కీర్తిగడించిన తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూరు ఆలయంలో బుధవారం వైకాశి విశాఖ ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. లక్షలాది మంది భక్తుల హరో హర దివ్య నామస్మరణతో తిరుచెందూర్ క్షేత్రం మార్మోగింది. ఈ ఉత్సవాల్లో పాల్గొనే నిమిత్తం రాష్ట్రం నలుమూలల నుంచి మంగళవారం ఉదయమే తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంతం, సముద్రతీర ప్రాంతం, బజారు వీధులు భక్తులతో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి అవతరించిన దినాన్నే వైకాశి విశాఖ పేరుతో ఉత్సవాలను జరుపుకొంటున్నారు. ఈ వైకాశి విశాఖ రోజు కుమారస్వామిని దర్శించుకుంటే సకల సంపదలు కలుగుతాయని, ప్రత్యేకించి శత్రువుల బాధలు, రోగబాధలు తొలగుతాయని శైవపండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైకాశి విశాఖ పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పసుపు దుస్తులు ధరించి నోటికి శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోస్తూ తిరుచెందూరు ఆలయానికి చేరుకున్నారు. బుధవారం వేకువజామునే స్వామివారిని దర్శించుకోవాలన్న ఆరాటంతో ఒక రోజు ముందుగానే ఆ దివ్య క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన భక్తులతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. పూలకావళ్లు, క్షీర కావళ్లు మోసుకొచ్చిన భక్తులంతా దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. వైకాశి విశాఖ సందర్భంగా ఆలయంలో మంగళవారం వేకువజాము 3 గంటలకు ఆలయాన్ని తెరచి, 3.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఐదు గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, ఉదయం 10.30 గంటలకు ఉచ్చికాల అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. బుధవారం స్వామి అవతార దినాన్ని పురస్కరించుకుని వైకాశి విశాఖ, వసంతోత్సవం పేరుతో వేకువజాము ఒంటి గంటకే ఆలయాన్ని తెరిచి లాంఛనంగా పూజలు ప్రారంభించారు. వేకువజాము ఒంటిగంటకు విశ్వరూప దర్శనం, దీపారాధన, నాలుగు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం 10.30 గంటలకు ఉచ్చికాల అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 10.30 గంటల తర్వాత స్వామివారు జయంతినాథుడు వసంత మండపానికి వేంచేసి 11 సార్లు ప్రదక్షిణ చేసి, మునికుమారులకు శాపవిమోచనం కలిగించారు. కాగా, ఈ నెల 13న ప్రత్యేక పూజలతో ప్రారంభమైన విశాఖ ఉత్సవాలు 10వ రోజైన బుధవారం రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక అభిషేకంతో ముగిశాయి.


పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న భక్తులు


నోటికి శూలాలు గుచ్చుకొని తరలివెళ్తున్న భక్తులు


దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

తిరుప్పరంకుండ్రంలో షణ్ముకుడికి ప్రత్యేక అభిషేకాలు


ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): కుమారస్వామి కొలువైన ఆరుదివ్య క్షేత్రాలలో ప్రథమ క్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుప్పరంకుండ్రం ఆలయంలో వైకాశి విశాఖ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు మంగళవారమే విచ్చేశారు. వేకువజాము ఐదుగంటలకే సన్నిధిలో వళ్లిదేవసేన సమేతుడైన షణ్ముఖస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆరుగటలకు కంబత్తడి మండపంలోని వళ్లిదేవసేన సమేత షణ్ముఖస్వామి సర్వాలంకరణ శోభితులై వేంచేశారు. ఆ మండపం వద్దే ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు మోసుకొచ్చిన క్షీరకలశాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అలా అభిషేకించిన పాలను భక్తులందరికీ పంపిణీ చేశారు. ఇదే విధంగా స్వామివారి ఆరో దివ్యక్షేత్రమైన అళగర్‌మలైలోని పళముదిర్‌చోళై మురుగన్ ఆలయంలోనూ స్వామివారి అవతార దినమైన వైకాశి విశాఖ వేడుకలు ఘనంగా జరిగాయి.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మహదేవన్



పెరంబూర్, మే 22: మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆర్.మహదేవన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎస్వీ గంగాపూర్‌వాలా పదవీకాలం గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా వున్న జస్టిస్ ఆర్.మహదేవన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. శుక్రవారం నుంచి ప్రధాన న్యాయమూర్తికి సంబంధించిన పనులను జస్టిస్ మహదేవన్ పర్యవేక్షించనున్నారు. 1963 జూన్‌లో జన్మించిన మహదేవన్, 1989లో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. 2013లో ఆయన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

త్వరలో ఇద్దరు మంత్రులకు ఉద్వాసన!


మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆర్.గాంధి

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఇద్దరికి ఉద్వాసన తప్పదని తెలిసింది. పలువురి శాఖల మార్పుతోపాటు ఇద్దరు సీనియర్లను బయటకు పంపనున్నట్లు డీఎంకే వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. మంత్రుల శాఖల మార్పుపై ముఖ్యమంత్రి స్టాలిన్ కొంతమంది సీనియర్లతో సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు ముందు మంత్రులు, జిల్లా శాఖ నేతల సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఫలితాలు ప్రతికూలంగా వచ్చినా, కూటమి అభ్యర్థులకు మెజారిటీ తగ్గినా ఆయా జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా శాఖల నాయకులపై వేటు పడుతుందని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు డీఎంకే కూటమికి సానుకూలంగా వెలువడతాయని, అన్ని నియోజకవర్గాల్లో గెలుపు తప్పదని ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా స్టాలిన్‌కు రహస్య నివేదికలు అందాయి. పుదుచ్చేరి సహా 40 లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఆ నివేదికలను స్టాలిన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం పదిమంది మంత్రులు, జిల్లా శాఖల కార్యదర్శులు లోక్‌సభ ఎన్నికల సమయంలో సక్రమంగా పనిచేయలేదని తెలిసింది. దీనితో మంత్రులు, జిల్లా శాఖల నాయకుల గుండెల్లో ప్రస్తుతం రైళ్లు పరిగెడుతున్నాయి. కాగా చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్.గాంధీ, రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్‌లకు మంత్రివర్గం నుంచి ఉద్వాసన తప్పదని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ అనారోగ్యంతో విధులు సరిగ్గా నిర్వర్తించలేకపోవడంతో ఆయన్ని దూరంగా పెట్టాలని సీఎం యోచిస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో ఆర్.గాంధీ పని తీరు పట్ల సీఎం ఏమాత్రం సంతృప్తికరంగా లేరని, అందుకే ఆయన్ని దూరంగా పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇక సీనియర్ మంత్రి దురైమురుగన్ వద్దనున్న కొన్ని శాఖలను ఇతర మంత్రులకు కేటాయించడం లేదా కొత్త మంత్రులను నియమించి వారికి ఆ శాఖలు కేటాయించే అవకాశాలున్నాయని తెలిసింది. దురైమురుగన్ నిర్వర్తిస్తున్న ఇసుకక్వారీలు, గనులు, ఖనిజాల శాఖలను ఇతర మంత్రులకు కేటాయిస్తారని చెబుతున్నారు. ఇసుక క్వారీల్లో పరిమితికి మించి తవ్వకాలు జరిగి ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందనే ఆరోపణలపై ఈడీ అధికారులు విచారణ జరుపుతున్న నేపథ్యంలో దురైమురుగన్ వద్దనున్న ఇసుక క్వారీలు, ఖనిజ శాఖలను మరొకరికి అప్పగించడంపై సీఎం యోచిస్తున్నట్లు తెలిసింది. అయితే దురైమురుగన్ మాత్రం ఖనిజ శాఖను తన వద్దనే వుంచుకుని, జలవనరుల శాఖను వదులుకునేందుకు సుముఖంగా వున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచి అధికారంలోకి వస్తే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్‌కు కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారని పార్టీవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక మంత్రివర్గ మార్పుల సమయంలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి స్వంత జిల్లా సేలంకు చెందిన శాసనసభ్యుడు పనమరత్తుపట్టి రాజేంద్రన్‌కు మంత్రి పదవి కట్టబెట్టాలని స్టాలిన్ భావిస్తున్నట్లు తెలిసింది.

న్యాయవ్యవస్థలోని సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎంఎం సుందరేశ్


శంకుస్థాపనలో పాల్గొన్న న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, గంగాపూర్‌వాలా, మహాదేవన్ తదితరులు

ప్యారీస్, మే 22: న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే అందులోని ఉద్యోగులకు అన్ని వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేశ్ అభిప్రాయపడ్డారు. స్థానిక బ్రాడ్‌వేలోని మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న పాత న్యాయ కళాశాల సమీపంలో 5 అంతస్తుల క్రిమినల్ కోర్టు నిర్మితం కానుంది. బుధవారం ఉదయం జరిగిన శంకుస్థాపనలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుందరేశ్ పాల్గొని భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందరి జీవితాల్లో విశ్రాంతి తప్పనిసరి అని మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ గంగాపూర్‌వాలా వెలువరించిన తీర్పులు, న్యాయశాఖకు ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. సమాజంలో నేరాలు, ఘోరాలకు సంబంధించిన కేసులు తగ్గాలని, హక్కులకు సంబంధించిన కేసుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయశాఖతో, కోర్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమన్వయంతో వ్యవహరిస్తేనే కేసుల విచారణ త్వరితగతిన ముగియడంతోపాటు బాధితులకు సకాలంలో పరిష్కారం ఉంటుందన్నారు. న్యాయశాఖలో ఒక్క న్యాయవాదులు మాత్రమే ఉండరని, సిబ్బంది కూడా తమ కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చాలని సూచించారు. పదవీవిరమణ పొందనున్న హైకోర్టు సీజే గంగాపూర్‌వాలా అనంతరం ఆ పదవి చేపట్టనున్న న్యాయమూర్తి ఆర్.మహాదేవన్ కూడా సమర్థవంతంగా పనిచేస్తారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. న్యాయశాఖ సమర్థవంతంగా పనిచేయాలంటే అందులో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వసతులు కల్పించాలని, జిల్లా కోర్టుల ఉద్యోగులకు ప్రత్యేకంగా చీఫ్ జస్టిస్ నివారణ నిధి ద్వారా 21,000 మంది లబ్ధి పొందినట్లు న్యాయమూర్తి కృష్ణకుమార్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం హైకోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తులు ఆర్.మహాదేవన్, కృష్ణకుమార్, ఆర్.సుబ్రమణియన్, ఆర్.సురేష్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



విలేఖరులతో మాట్లాడుతున్న సెల్వపెరుందగై

ప్యారీస్, మే 22: పూరి జగన్నాథస్వామి ఆలయ భాండాగారం తాళం చెవులు తమిళనాడుకు తరలిపోయాయని తమిళులను కించపరిచే విధంగా మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు క్షమాపణ చెప్పాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సెల్వపెరుందగై మాట్లాడుతూ...తమిళనాడు పర్యటనకు వచ్చే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ తిరుక్కురల్, తమిళ సాహిత్యం గురించి పొగడ్తలతో ముంచెత్తుతారని, అయితే ఇటీవల లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఒడిస్సా రాష్ట్రంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన ప్రధాని మోదీ, తమిళులను దొంగలుగా చిత్రీకరిస్తూ అవమానించే విధంగా మాట్లాడడం ఖండించదగ్గదన్నారు. ప్రసిద్ధిచెందిన పూరి జగన్నాథస్వామి ఆలయంలోని భాండాగారం తాళాలు తమిళనాడుకు చేరాయని మాట్లాడడం సరికాదని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కూడా ప్రధాని మోదీలాగే తమిళుల గురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారని, వీరు క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రధాని ప్రసంగాన్ని ఎవ్వరూ అర్థం చేసుకోలేరు : అన్నామలై

ఒడిస్సా రాష్ట్రంలోని పూరి జగన్నాథస్వామి ఆలయ భాండాగారం గురించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సహా ఇండియా కూటమి పార్టీల నేతలు సరిగ్గా అర్థం చేసుకోలేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... జగన్నాథస్వామి ఆలయ భాండాగారం తాళాలు కనిపించకుండా పోవడానికి గల కారణాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ కనిపెట్టాలని, ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న తమిళనాడుకు చెందిన వీకే పాండ్యన్ ఇందుకు బాధ్యులని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించడంలో తప్పులేదన్నారు. పాండ్యన్ తమిళుడు కావడంతో మిగతా తమిళులందర్నీ కించపరచినట్లు ప్రధాని మాట్లాడారని తమిళ నేతలు తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.

కన్నియాకుమారిలో కుండపోత


కన్నియాకుమారి సాయినగర్‌లో ప్రవహిస్తున్న వర్షపునీరు

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో మంగళవారం సాయంత్రం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం తీవ్రరూపం దాల్చి రాత్రంతా కుండపోతగా కురిసి పల్లపు ప్రాంతాలను ముంచెత్తింది. రహదారులలో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభమైన వర్షాలు బుధవారం వేకువజాము వరకూ కొనసాగింది. కొట్టారంలో మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఆ ప్రాంతంలో 84.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మయిలాడి, నాగర్‌కోవిల్ కన్నిమార్, మాంబళతురైయారు, కుళిత్తురై, సురులోడు తదితర ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షం కురిసింది. సేలం జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల దాకా వర్షాలు కురిశాయి. మహాత్మాగాంధీ క్రీడామైదానంలో వర్షపునీరు వరదలా ప్రవహిచింది. ఇదేవిధంగా పనమరత్తుపట్టి వద్ద భారీ వర్షాలకు అడవి వెల్లువలు రహదారులను నీటితో ముంచెత్తాయి. ఏరుగుమలై ప్రాంతంలో అడవివెల్లువలు ముంచెత్తడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్న 1500 మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు.


కన్నియాకుమారి బోట్‌హౌస్ బీచ్ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న జలాలు

నైరుతి రుతుపవనాల ముందస్తు చర్యలు

● 33 కాల్వలలో పూడికతీత పనులు

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాలను ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతుంది. ఆ మేరకు నగరంలోని 33 ప్రధాన కాల్వలలో పూడికతీత పనులను చేపడుతోంది. ఈ పనులకుగాను ప్రతి జోన్‌కు రూ.50లక్షల చొప్పున నిధులను కేటాయిచింది. నగరంలోని 15 జోన్‌లలోని వాననీటి కాల్వలు, మురుగునీటి కాల్వల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతోంది. ఓట్టేరి నల్లాన్ కాలవు, విరుగంబాక్కం కాలువ, మాంబళం కాలువన, రాజ్‌భవన్ కాలువ, బకింగ్‌హామ్ కాలు, అడయారు, కూవం కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించి పూడిక పనులు ప్రారంభించారు. ఈ పనులన్నీ ఈ నెలాఖరు లోపున పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు.



మాంబళం మురుగనీటి కాల్వలో చేపడుతున్న పూడికతీత పనులు

సమాచార దర్శిని

గృహ నిర్మాణానికి రూ.లక్ష రుణం

ఐసిఎఫ్, మే 22: రాష్ట్ర ప్రభుత్వ 'కలైంజర్ కనవు ఇల్లం' పథకంలో గృహ నిర్మాణానికి రూ.లక్ష రుణం అందజేయనున్నట్లు సహకార శాఖ తెలిపింది. ఈ పథకం ద్వారా ఆరు నెలల్లో 8 లక్షల గుడిసెవాసులకు తలా రూ.3.50 లక్షల వ్యయంతో కాంక్రీట్ గృహాలు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం మొదటి సంవత్సరానికి రూ.3,500 కోట్ల నిధులు కేటాయించింది. అంతకన్నా ఎక్కువ ఖర్చు చేసే లబ్ధిదారులు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని వెల్లడించింది. ఈ రుణాన్ని మూడు నుంచి ఐదేళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

రాయితీపై పురావస్తు పుస్తకాలు

ఐసిఎఫ్, మే 22: భారత పురావస్తు శాఖ విడుదల చేసిన పుస్తకాలను 40 శాతం రాయితీ ధరకు విక్రయిస్తున్నట్లు ఆ శాఖ చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు. శిలాశాసనాలకు సంబంధించిన గ్రంథాలు, అజంతా, ఎల్లోరా, తంజావూరు బృహదీశ్వర ఆలయం, మహాబలిపురం సముద్రతీర ఆలయం వంటి చారిత్రాత్మక చిహ్నాలకు సంబంధించిన పుస్తకాలు విక్రయిస్తున్నారు. స్థానిక సెయింట్ జార్జి కోటలో ఉన్న పురావస్తు శాఖ కార్యాలయం, సెంజి కోట, మహాబలిపురం ప్రాంతాల్లో ఉన్న ఈ శాఖా కార్యాలయాల్లో 40 శాతం రాయితీతో ప్రజలకు, విద్యార్థులకు 50 శాతం రాయితీతో పుస్తకాలు విక్రయించనున్నట్లు తెలియజేశారు.

కిలంబాక్కం బస్టాండ్‌లో 10 ఏటీఎంలు

ఐసిఎఫ్, మే 22: స్థానిక కిలంబాక్కం బస్ టెర్మినల్ త్వరలో 10 ఏటీఎంలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ బస్టాండ్‌లో ఐఓబీ ఏటీఎం మాత్రమే ఉంది. వేలసంఖ్యలో వచ్చి వెళుతున్న ప్రయాణికుల సౌకర్యార్థం ఏటీఎంలు అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఫిర్యాదులందడంతో, వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో 10 ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంటీసీ ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 22: మెట్రోపాలిటన్ రవాణా సంస్థ (ఎంటీసీ) ఆధ్వర్యంలో ఐటీఐలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. క్రోంపేటలో ఉన్న ఐటీఐలో 42వ వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. 40 ఏళ్లలోపున్న టెన్త్ ఉత్తీర్ణులైన వారు జూన్ 30లోపు దరఖా స్తు చేసుకోవచ్చు. శిక్షణా తరగతుల్లో పాల్గొనే విద్యార్థులు ఏడాదికి రూ.10 వేలు చెల్లించాలని అధికారులు తెలిపారు.

మురుగునీటి సమస్యలపై ఫిర్యాదుకు నెంబరు

ఐసిఎఫ్, మే 22: మురుగునీటి సమస్యలపై ఫిర్యాదులకు మెట్రోవాటర్ బోర్డు ప్రత్యేక నెంబరు విడుదల చేసింది. వ్యాసర్పాడి జీవా రైల్వేస్టేషన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణపనుల కోసం రెండు రోజులు పురుషవాక్కం మురుగునీటి పంపింగ్ స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో నీరు పొంగి ప్రవహించే అవకాశముంది. తిరువికనగర్, రాయపురం, అన్నానగర్, తేనాంపేట మండలాల్లో ఉన్న వారు 8144930905 అనే నెంబరు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, మే 22: స్థానిక విరుగంబాక్కంలో ఆక్రమణకు గురైన కార్పొరేషన్ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోడంబాక్కం మండలం 127వ వార్డు విరుగంబాక్కం నటేశన్ నగర్ రెండవ మెయిన్ రోడ్డులో 3,100 చ.అ కార్పొరేషన్ స్థలాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలు, గృహాలు నిర్మించారు. వాటిని తొలగించాలని నోటీలిచ్చినా ఖాతరు చేయకపోవడంతో, అధికారులు ఆక్రమణలు కూల్చి రూ.5 కోట్ల విలువైన స్థలం స్వాధీనం చేసుకున్నారు.

కొండ రైలు సేవలు ప్రారంభం

పెరంబూర్, మే 22: ఊటీ కొండ రైలు సేవలు బుధవారం యధావిధిగా ప్రారంభమయ్యాయి. నీలగిరి జిల్లాల్లో కొద్దిరోజులుగా వర్షాల కారణంగా రైలు పట్టాలపై మట్టిచెరియలు, బండరాళ్లు పడడంతో కొండ రైలు సేవలను ఈనెల 18వ తేది నుంచి నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడం, పట్టాలపై పడిన రాళ్లు తొలగించడంతో, బుధవారం ఉదయం 7.10 గంటలకు యధావిధిగా మేట్టుపాళయం నుంచి పర్యాటకులతో కొండ రైలు బయల్దేరి వెళ్లింది.

యువజన అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 22: ముఖ్యమంత్రి రాష్ట్ర యువజన అవార్డుకు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న యువకులకు ఈ పురస్కారం ప్రభుత్వం అందజేస్తోంది. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం రోజు 15 నుంచి 35 ఏళ్లలోపున్న ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలను ప్రభుత్వం సన్మానిస్తోంది. ప్రశంసా పత్రం, రూ. లక్ష నగదు ఇస్తారు. 2023 సంవత్సరానికి సంబంధించిన అర్హులైన వారు www.sdat.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దివ్యాంగుల బాటకు మరమ్మతులు

ఐసిఎఫ్, మే 22: స్థానిక మెరీనా తీరంలో ధ్వంసమైన దివ్యాంగుల కొయ్య బాటకు మరమ్మతులు జరుగుతున్నాయి. మెరీనా తీరంలో దివ్యాంగులు సముద్రం ఒడ్డుకు చేరుకొనేలా ప్రత్యేక బాటను కొయ్యలపై ఏర్పాటుచేశారు. ఇటీవల ఈ బాటను కొందరు ఆకతాయిలు ధ్వంసం చేశారు. దీని పై ఫిర్యాదులందడంతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. శాశ్వత మార్గం ఏర్పాటుచేయాలని దివ్యాంగులు, సంఘ శ్రేయోభిలాషులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నీలగిరిలో జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు

ఐసిఎఫ్, మే 22: నీలగిరి జిల్లాలో జాతీయ థర్మల్ విద్యుత్ సంస్థ, రాష్ట్ర విద్యుత్ బోర్డు సంయుక్తంగా మూడు జలవిద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాయి. నీలగిరి జిల్లాలో 1,200 మెగావాట్ల సామర్థ్యంతో కుండినల్లా, 1,000 మెగావాట్ల సామర్థ్యంతో అప్పర్‌భవానీ, 800 మెగావాట్ల సామర్థ్యంతో సిక్కూర్ ప్రాంతాల్లో ఈ స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. సరిపడా నిధులు లేకపోవడంతో ప్రస్తుతం 1,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అప్పర్‌భవానీ జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది.

జల్లికట్టు పోటీలకు హైకోర్టు అనుమతి

పెరంబూర్, మే 22: మదకుపట్టిలో జల్లికట్టు, కల్లెనావల్‌కనియాన్ మఠం గ్రామంలో ఎద్దులు వదిలే పోటీల నిర్వహణకు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ అనుమతులు జారీచేసింది. ఈ పోటీలకు తగిన భద్రత, నిబంధనలను రూపొందించి అనుమతులివ్వాలని, ఈ రెండు గ్రామాల్లో జల్లికట్టు, ఎద్దులు వదిలే పోటీలు గెజిట్‌లో ప్రచురించాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

పెరిగిన బ్రాయిలర్ కోళ్ల ధరలు

పెరంబూర్, మే 22: నగరంలో బ్రాయిలర్ కోళ్ల ధరలు పెరిగాయి. ఎండ తీవ్రత కారణంగా నామక్కల్, పరిసర ప్రాంతాల్లో కోళ్ల ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో బ్రాయిలర్ కోడి కిలో రూ.320 నుంచి రూ.380 వరకు పెరిగిందని వ్యాపారులు తెలిపారు.

పారిశుధ్య పథక ఉద్యోగులకు శిక్షణ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, అధికారులు

వేలూరు, మే 22: జిల్లా కలెక్టర్ సుబ్బలక్ష్మి ఉత్తర్వులతో శుభ్రతా పథక ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక విరుపాక్షిపురంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జానకి, ఉప కమిషనర్ సౌందర్‌రాజన్ పాల్గొన్నారు. తమిళనాడు శుభ్రతా ఇయక్కం రాష్ట్ర ప్రధాన కమిటీ సభ్యులు ఎలిజబెత్, గౌతమ్, రంజిని, శివరామన్, సీతాలక్ష్మి తదితరులు శిక్షణ అందించారు. కార్యక్రమం కార్పొరేషన్ అధికారి గణేష్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం కాగా, శుభ్రతా అధికారులు శివకుమార్, మురుగన్, బాలమురుగన్, శుభ్రతా శాఖ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, తాత్కాలిక శుభ్రతా సూపర్‌వైజర్ శిక్షణలో పాల్గొన్నారు.

దుకాణాల్లో బాలుర మామూళ్ల వేట

● ఆగ్రహంతో 10 బైకుల ధ్వంసం

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం, ట్రస్టుపురం, వరదరాజపేట తదితర ప్రాంతాల్లో మద్యం మత్తులో నలుగురు బాలురు నానారభసకు పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆ బాలురు దుకాణాలలో మామూళ్లు అడుగుతూ ఇవ్వని దుకాణాల వద్ద పార్కింగ్ చేసిన బైకులను ధ్వంసం చేశారు. దుకాణం యజమానులు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన అక్కడికి వెళ్ళిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఆ నలుగురు 15 నుంచి 17 యేళ్లలోపు వయస్సు కలిగినవారని కనుగొన్నారు. విచారణ తర్వాత వారిని బాల నేరస్థుల కారాగారానికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వివాహేతర సంబంధం తెచ్చిన తంటా

● కేంద్ర ప్రభుత్వోద్యోగిని వద్ద మోసం

● మహిళ సహా నలుగురి అరెస్టు


చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వోద్యోగి వద్ద వివాహేతర సంబంధం పెట్టుకుని ఉల్లాసంగా ఉన్నప్పుడు తీసిన రహస్య వీడియోను విడుదల చేస్తామంటూ లక్షలాది రూపాయలను గుంజిన మహిళను, ఆమెకు సాయపడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుముల్లైవాయిల్ ప్రాంతానికి చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వెంకటేశన్ (59)కు, మైలాడుదురై ప్రాంతానికి చెందిన సుభాషిణి (40)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇరువురూ కారైక్కాల్‌లో రోజుల తరబడి ఉల్లాసంగా గడిపేవారు. ఈ నేపథ్యంలో వెంకటేశన్ వద్ద భారీగా డబ్బులు గుంజాలని పథకం వేసుకున్న సుభాషిణి తన అనుచరులతో కలిసి ఆయనను మైలాడుదురైకి రప్పించింది. గతంలో ఇరువురూ ఉల్లాసంగా గడిపినప్పుడు తీసిన అశ్లీల వీడియోను విడుదల చేస్తామంటూ బెదరించింది. ఆయన వద్దనున్న రూ.2.70లక్షలను లాక్కుని, వీడియో విడుదల చేయకుండా ఉండాలంటే రూ.10లక్షలు తమకు ముట్టజెప్పాలని తరిమికొట్టింది. దీనితో తీవ్ర దిగులు చెందిన వెంకటేశన్ మైలాడుదురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి సుభాషిణి, ఆమె అనుచరులు మహమ్మద్ నజీర్, దినేష్‌బాబు ముప్పేందర్ మున్నేట్ర కళగం స్థానిక నాయకుడు గిల్లీ ప్రకాష్‌ను అరెస్టు చేశారు.

ఎరువుల ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై నిరసన

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నూరు పెరియకుప్పం ప్రాంతంలో గత యేడాది డిసెంబర్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్‌కు కారణమైన ప్రైవేటు ఎరువుల కర్మాగారాన్ని మళ్ళీ ప్రారంభించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై 23 గ్రామాలకు చెందిన జాలర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్ 26న ఆ కర్మాగారం నుంచి అమ్మోనియా గ్యాస్ లీక్ కావటంతో నెట్టుకుప్పం, తాళంకుప్పం, చిన్నకుప్పం, పెరియకుప్పం, ఎర్నావూరు, సునామీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ కార్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ 83 రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తమ ఆందోళనను తీవ్ర తరం చేయనున్నట్లు ఎన్నూరు జాలర్ల సంఘాల సమాఖ్య నాయకులు ప్రకటించారు.

రాహుల్‌ను ప్రశంసించిన 'ఎక్స్' పేజీ తొలగింపు

ప్యారీస్, మే 22: కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీపై ప్రశంసల జల్లు కురిపిస్తూ మంగళవారం 'ఎక్స్' పేజీలో వెలువరించిన సందేశాన్ని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు తొలగించారు. ఇటీవల తాను చూసిన, మెచ్చిన యువ నాయకుడు రాహుల్ గాంధీయేనని సెల్లూరు రాజు కితాబిస్తూ ఆయన ఎక్స్ పేజీలో వ్యాఖ్యలు చేయడం సోషల్ మీడియాలో వైరలైంది. ప్రస్తుతం అధికార డీఎంకే కూటమిలో కాంగ్రెస్ ఉన్నందువల్ల, సెల్లూరు రాజు రాహుల్ గురించి చేసిన ప్రశంసలు అన్నాడీఎంకే నేతలను కలవరపరిచింది. అంతేకాకుండా అన్నాడీఎంకే అధిష్ఠానం కూడా వివరణ కోరుతూ సెల్లూర్ రాజుకు నోటీసు జారీచేసేందుకు నిర్ణయించిందని తెలిసింది. దీంతో పార్టీలో తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సెల్లూర్ రాజు, రాహుల్ గాంధీని ప్రశంసిస్తూ వెలువరించిన ఎక్స్ పేజీ సందేశాన్ని బుధవారం తొలగించారు.



వేలూరు పలవన్ సాత్తుకుప్పంలోని భూగర్భ వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

భక్తుడి మృతి ఘటనలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

ప్యారీస్, మే 22: తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో విద్యుదాఘాతానికి ఓ భక్తుడు మృతిచెందిన వ్యవహారంలో విద్యుత్ విభాగానికి చెందిన ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. తిరుత్తణి సమీపంలోని కోరమంగళంకు చెందిన గోవిందరాజ్ (65) ఇటీవల దర్శనం కోసం ఆలయానికి వెళ్లి విద్యుత్ షాకు గురై మరణించాడు. విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యమే గోవిందరాజ్ మృతికి కారణమని ఆయన బంధువులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు, తిరుత్తణి ఆలయ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న ఏలుమలై, అల్లిముత్తు, అర్జున్‌లను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

విమానంలో వచ్చిన కడలూరు యువకుడి మాయం

● పోలీసులకు తండ్రి ఫిర్యాదు

ప్యారీస్, మే 22: సింగపూర్ నుంచి శ్రీలంక మీదుగా 12 రోజుల క్రితం విమానంలో చెన్నైకి వచ్చి మాయమైన యువకుడి ఆచూకీ కోసం ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడలూరు జిల్లా తిట్టకుడి సమీప గ్రామానికి చెందిన రైతు సంగిలి కుమారుడు పెరియస్వామి (21) ఏడు నెలలక్రితం సింగపూర్‌కు వెళ్లి అక్కడ ఉద్యోగం చేసేందుకు ఇష్టపడక ఈనెల 10వ తేది విమానంలో చెన్నైకి బయల్దేరాడు. అయితే 12 రోజుల క్రితం చెన్నైలో విమానం దిగిన పెరియస్వామి ఇంటికి చేరుకోలేదని తెలిసింది. ఆయన తండ్రి సంగిలి సంబంధిత సింగపూర్ సంస్థను సెల్‌ఫోన్ ద్వారా కుమారుడి గురించి వాకబు చేయగా, అతనిని తామే దగ్గరుండి చెన్నై విమానం ఎక్కించి సాగనంపినట్లు తెలిపారు. దీంతో సంగిలి మంగళవారం చెన్నై విమానాశ్రయం చేరుకొని పోలీసులను సంప్రదించి తమ కుమారుడి ఆచూకీ తెలుసుకొని అప్పగించాలంటూ అందజేసిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేసి గాలింపు చర్యలు చేపట్టారు.

సింగపూర్ విమానంలో సాంకేతికలోపం

చెన్నై, మే22(ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మంగళవారం రాత్రి సింగపూర్ బయల్దేరాల్సిన విమానంలో సాంకేతికలోపం కారణంగా ప్రయాణికులు అగచాట్ల పాలయ్యారు. ప్రతిరోజు సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానం రాత్రి 10 గంటలకు చెన్నై చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంగా రాత్రి 11.15 గంటలకు సింగపూర్‌కు బయల్దేరుతుంది. మంగళవారం రాత్రి 11.15 గంటలకు 320 మంది ప్రయాణికులతో ఆ విమానం బయల్దేరాల్సి ఉంది. అంతకుముందు చీఫ్ పైలెట్ ఆ విమానాన్ని పరిశీలించి అందులో సాంకేతికలోపం ఉందని గుర్తించి విమానాశ్రయ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. దీంతో, ఇంజనీర్ల బృందం సాంకేతిక లోపం సరిచేసిన అనంతరం బుధవారం తెల్లవారుజామున 2.47 గంటలకు ఆ విమానం సింగపూర్‌కు బయల్దేరింది. మూడున్నర గంటలపాటు ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు.

కళాక్షేత్ర ప్రొఫెసర్‌కు బెయిల్ ఇవ్వొద్దు

● హైకోర్టులో అభ్యంతరం తెలిపిన పోలీసులు


ప్యారీస్, మే 22: విద్యార్థినిని లైంగిక వేధింపుల పాలు చేసిన కేసులో అరెస్టయిన కళాక్షేత్ర మాజీ ప్రొఫెసర్ శ్రీజిత్‌కృష్ణకు బెయిలు మంజూరు చేయరాదని పోలీసులు మద్రాసు హైకోర్టులో అభ్యంతరం తెలుపుతూ అఫిడవిట్ దాఖలుచేశారు. కళాక్షేత్ర నాట్య పాఠశాలలో 1995 నుంచి 2001వ సంవత్సరం వరకు చదువుకున్న ఓ విద్యార్థిని, శ్రీజిత్ కృష్ణ తనను లైంగికంగా వేధించారని నీలాంగరై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను పోలీసులు గత నెల 22న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీజిత్‌కు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి సి.శరవణన్ విచారణ జరుపగా హాజరైన పిటిషన్ తరపు న్యాయవాది... 28 ఏళ్ల క్రితం జరిగినట్లు పోలీసులు చెబుతున్న ఈ కేసులో ప్రస్తుతం వైద్యపరంగా ఎలాంటి ఆధారాలు నిరూపించలేరని తెలిపారు. పోలీసుల తరపున హాజరైన న్యాయవాది శ్రీజిత్ కృష్ణకు మంజూరు చేస్తే సాక్ష్యులను తారుమారు చేసే అవకాశముందని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం ఈ కేసు విచారణ గురువారానికి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

తూత్తుకుడి ఘటన మృతులకు నివాళి



మృతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి గీతా జీవన్

పెరంబూర్, మే 22: తూత్తుకుడి తుపాకి కాల్పులు జరిగి బుధవారంతో ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తుపాకి కాల్పుల మృతులకు మంత్రి గీతాజీవన్, పలు పార్టీల నేతలు, ప్రజా సంఘాలు నివాళులర్పించారు. తూత్తుకుడి స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా గత 2018 మే 22వ తేది జరిగిన ఆందోళన హింసాత్మకంగా మారడంతో, దానిని అదుపుచేసేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో 13 మంది మృతిచెందగా, 100 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం స్టెరిలైట్ కర్మాగారానికి రాష్ట్రప్రభుత్వం సీలు వేసింది. ఈ ఘటన జరిగి ఆరేళ్లు పూర్తికావడంతో మృతులకు పలువురు నివాళులర్పించారు. తూత్తుకుడి ఉత్తర జిల్లా డీఎంకే కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి గీతాజీవన్ పాల్గొని, తుపాకి కాల్పుల మృతుల చిత్రపటాలకు పూలు చల్లి నివాళులర్పించారు. అలాగే, స్టెరిలైట్ వ్యతిరేక ఆందోళనలు జరిగిన కుమరెడ్డియాపురం, వీరపాండ్యపురం, మడత్తూర్, సిల్వర్‌పురం, ఫాతిమానగర్, తోమయార్ ఆలయ వీధి, భూపాలరాయపురం, లయన్స్‌టౌన్ సహా పలు ప్రాంతాల్లోనూ జరిగిన కార్యక్రమాల్లో పలు పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొని, తుపాకి కాల్పుల మృతుల చిత్రపటాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.



వేలూరు తొరపాడిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం పరిశీలిస్తున్న వేలూరు లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం

2 వరకు తాగునీటి సరఫరాలో మార్పులు

పెరంబూర్, మే 22: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ), తాంబరం కార్పొరేషన్ల పరిధిలో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా అవుతుందని చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలిపింది. ఈ మేరకు బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... నైరుతి రుతుపవనాలు ప్రవేశించేందుకు ముందుగానే నెమ్మెలిలో ఉన్న నిర్లవణీకరణ కేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్నారు. అందువల్ల శనివారం (ఈనెల 24వ తేది) నుంచి జూన్ 2వ తేది వరకు (10 రోజులు) జీసీసీ పరిధిలోని 9,13,14,15 మండలాలు, తాంబరం కార్పొరేషన్‌లోని కొన్ని ప్రాంతాల్లో రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేయనున్నారు.

9వ మండలం (తేనాంపేట ఏరియా): మందవెల్లి, మైలాపూర్, రాజా అన్నామలైపురం, నందనం, ట్రిప్లికేన్, రాయపేట

13వ మండలం (అడయార్ ఏరియా): మందవెల్లి, బీసెంట్ నగర్, మడివన్‌కర్రై, బేబి నగర్, తంథై పెరియార్ నగర్, కరుణానిధి నగర్, కళాక్షేత్ర కాలనీ, వేళచ్చేరి, పల్లిపట్టు, తిరువళ్లువర్ నగర్, ఏజీఎస్ కాలని

14వ మండలం (పెరుంగుడి ఏరియా): కొట్టివాక్కం, పెరుంగుడి, పాలవాక్కం, కావేరి నగర్, తిరుమలై నగర్, పల్లికరనై, మడిపాక్కం, ఉల్లగరం-పుళిదివాక్కం, కామాక్షి కాలని, జల్లడియన్‌పేట

15వ మండలం (షోలింగనల్లూర్ ఏరియా): నీలాంగరై, సరస్వతి నగర్, ఒక్కియం దురైపాక్కం, ఇంజంబాక్కం, ఎళిల్ నగర్, కన్నగి నగర్, ఉత్తాండి, పనైయూర్, కారపాక్కం, షోలింగనల్లూర్, సెమ్మంజేరి, తాంబరం కార్పొరేషన్. అత్యవసరాలకు 8144930909 (తేనాంపేట), 8144930913 (అడయార్), 8144930914 (పెరుంగుడి), 8144930915 (షోలింగనల్లూర్), తాంబరం కార్పొరేషన్ ప్రధాన ఇంజనీర్ 9442976905, నిర్వహణ ఇంజనీర్ 8248888577 అనే నెంబర్లు, లారీల ద్వారా నీరు పొందేందుకు https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించాలని చెన్నై మెట్రోవాటర్ బోర్డు ప్రకటనలో తెలిపింది.

ఉచిత విద్యకు 1.30 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 22: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ప్రస్తుత విద్యా సంవత్సరానికి 1.30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయిస్తున్నారు. ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 7,823 పాఠశాలల్లో 85,000 సీట్లున్నాయి. ఈ పథకంలో ఎల్కేజీ లేదా 1వ తరగతిలో చేరిన విద్యార్థులు 8వ తరగతి వరకు ఎలాంటి ఫీజు చెల్లించకుండా విద్య అభ్యసించవచ్చు. రాష్ట్రంలో గత 2013వ సంవత్సరం నుంచి అమలుకు వచ్చిన ఈ పథకంలో ఇప్పటివరకు 4.6 లక్షల మంది పేద విద్యర్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదివారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) ఈ పథకంలో విద్యార్థుల అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరణ గత నెల 22వ తేది ప్రారంభమై సోమవారంతో ముగిసింది. సుమారు 1.30 లక్షల మంది దరఖాస్తులు సమర్పించగా, వాటిని పరిశీలించి అర్హులైన వారికి సీట్లు కేటాయించనున్నారు. ఒకవేళ ఏదైనా పాఠశాలలో కేటాయించిన సీట్ల కంటే ఎక్కువ దరఖాస్తులు అందితే, ఈ నెల 28వ తేది తల్లిదండ్రుల సమక్షంలో డ్రా తీసి విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. విద్యార్థుల వివరాలు ఈనెల 29వ తేది వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాలు rte.tnschools.gov.in అనే వెబ్‌సైట్, 14417 అనే సహాయ కేంద్రాన్ని సంప్రదించి తెలుసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పోలీసులూ టిక్కెట్లు తీసుకుని ప్రయాణించాలి

పెరంబూర్, మే 22: ప్రభుత్వ బస్సుల్లో పోలీసులు టిక్కెట్లు తీసుకొని ప్రయాణించాలని రాష్ట్ర రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. వారెంట్ ఉన్న పోలీసులు మాత్రమే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొంది. తిరునల్వేలి జిల్లా నాంగునేరి నుంచి తిరునల్వేలి మీదుగా తూత్తుకుడి వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న పోలీసును టిక్కెట్టు తీసుకోవాలని కండక్టర్ కోరడంతో, అందుకు నిరాకరించిన పోలీసు, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. దీనిపై స్పందించిన రవాణా శాఖ, ప్రభుత్వ బస్సుల్లో వారెంట్ లేకుండా ప్రయాణించే పోలీసులు తప్పకుండా టిక్కెట్టు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, టిక్కెట్టు లేకుండా ప్రయాణించి కండక్టర్‌తో వాగ్వాదానికి దిగిన పోలీసుపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని పోలీసు శాఖకు రవాణా శాఖ సిఫారసు చేసింది.

జూన్‌లో టీచర్ ట్రైనింగ్ పాఠశాలల అడ్మిషన్లు

ఐసిఎఫ్, మే 22: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం అడ్మిషన్లు జూన్‌లో ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో 12 జిల్లా ఉపాధ్యాయ విద్య, శిక్షణా సంస్థలు, 8 ప్రభుత్వ టీచర్ శిక్షణా సంస్థలు, 6 యూనియన్ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు పనిచేస్తున్నాయి. ఇవి మినహా 12 ఎయిడెట్ టీచర్ ట్రైనింగ్ కేంద్రాలు, 25 స్వయంప్రతిపత్తి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిలో ప్రభుత్వ పాఠశాలల్లో 4,170 సీట్ల భర్తీకి దరఖాస్తు స్వీకరణ జూన్ 7 నుంచి ప్రారంభం కానుంది.

ప్లస్ వన్, ప్లస్ టూ ఇన్‌స్టంట్ పరీక్షార్థులకు మార్గదర్శకాలు

ఐసిఎఫ్, మే 22: ప్లస్ వన్, ప్లస్ టూ ఇన్‌స్టంట్ పరీక్షలు రాసే వారికి అవసరమయ్యే సలహాలు, మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా ప్రధాన విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'నాన్ ముదల్వన్' పథకం కింద ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో చదివే ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు ఉన్నత విద్యకు సంబంధించిన మార్గదర్శకాలను నిపుణులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్లస్ వన్, ప్లస్ టూ ఇన్‌స్టంట్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్షలు రాయడంపై ప్రత్యేకంగా సలహాలు, మార్గదర్శకాలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రూ.2,755 కోట్లకు విద్యుత్ కొనుగోలు

ఐసిఎఫ్, మే 22: రాష్ట్రంలో వేసవి అవసరాలు పూర్తిచేసేలా రూ.2,755 కోట్లకు ప్రైవేటు నుంచి విద్యుత్ కొనుగోలు చేసినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. రాష్ట్ర విద్యుత్ ఒకరోజు వినియోగం 15,000 మెగావాట్లు. ఇందుకోసం విద్యుత్ బోర్డు స్వీయ ఉత్పత్తుల నుంచే కాకుండా ప్రైవేటు సంస్థల నుంచి కూడా కొనుగోలు చేసి సరఫరా చేస్తోంది. గత ఏడాది వేసవిలో ఒకరోజు విద్యుత్ వినియోగం 19,000 మెగావాట్లు కాగా, ఈ నెల 2వ తేది గరిష్టంగా 20,820 మెగావాట్లుంది. వేసవి అవసరాలకు ప్రైవేటు సంస్థల నుంచి రూ.2,755 కోట్లకు విద్యుత్ బోర్డు విద్యుత్ కొనుగోలు చేసింది.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, మే 22: పలువురు విధులు చేపట్టే సమయంలో ఆరోగ్యం గురించి ఆలోచించడడం లేదని, ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిపుణులు సూచించారు. నగరంలో ఆర్‌ఎండీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అండ్ ట్రస్ట్, హెచ్‌ఆర్ విద్యాలయ కార్పొరేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న హెచ్‌ఆర్, సీఎస్సార్ ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌ఎండీ గ్రూప్ హాస్పిటల్స్ అండ్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.రెపుబ్లిక శ్రీధర్, హెచ్‌ఆర్ గ్రూప్ హెడ్ మురళీధరన్, లక్ష్య ఫౌండర్ నిఖిల్ పంత్, హెచ్‌ఆర్ విద్యాలయం కార్పొరేట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ పార్టనర్ ఆనందన్ సుబ్రమణియన్ సహా పలువురు పాల్గొని, విధుల సమయంలో ఆరోగ్యం కాపాడుకొనేలా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో 80 కార్పొరేట్ సంస్థలకు చెందిన హెచ్‌ఆర్, సీఎస్సార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

వేలూరు, మే 22: పట్టణంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో గుడిసె ప్రాంతాల్లో నివసించే వారు పొయ్యిల్లో వంట చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. వీరి ఇబ్బందులు గుర్తించిన రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజసేవకుడు దినేష్ శరవణన్ బుధవారం ఆ ప్రాంతాల్లోని 100 మందికి రుచికరమైన టిఫిన్ అందజేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

వేలూరు, మే 22: చెన్నై నుంచి బెంగుళూరుకు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సోమనాథ్ సోరెన్ (25) ప్రయాణిస్తున్నాడు. అంబూరు సమీపం కన్నికాపురం ప్రాంతంలో రైలు వస్తున్న సమయంలో ఫుట్ బోర్డుపై ఉన్న సోమనాథ్ హఠాత్తుగా కాలు జారి కిందపడి తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై జోలార్‌పేట రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనం





కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనం - బలిపీఠం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కుప్పం, మే 22: చిత్తూరు జిల్లా కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం బుధవారం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఉదయంనుంచి బుధవారం దాకా అమ్మవారి ఖండిశిరస్సు ఊరేగింపు పట్టణ వీధులలో విరామమెరుగకుండా సాగి బుధవారం ఉదయం 11 గంటలవేళ ఆలయం చేరుకుంది. అక్కడ శేష దేహంపై అమ్మవారి శిరస్సును పూజారులు ప్రత్యేక పూజల నడుమ అమర్చారు. దీంతో ప్రసన్న తిరుపతి గంగమాంబకు సంపూర్ణ రూపం ఏర్పడింది. అమ్మవారిని అలంకరించిన తర్వాత భక్తుల దర్శనానికి అనుమతించారు. అప్పటికే క్యూలైన్లలో వేచివున్న భక్తులు గంగమ్మ విశ్వరూప దర్శనం చేసుకోవడానికి పోటెత్తారు. మూడు రాష్ట్రాలనుంచి భక్తజనం వేలాదిగా తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని తరించింది. బలిపీఠం వద్ద జంతు బలులతోపాటు కర్పూర నీరాజనాలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మాంసాహార వంటకాలతో బంధుమిత్రులకు విందు భోజనాలు పెట్టారు. గంగమ్మ విశ్వరూప దర్శనవేళ కులమత భాషా భేదం లేకుండా సర్వజనులూ అమ్మను కొలిచి తరించారు.


'పెక్ళియార్ సుళి'లో ఓ దృశ్యం

ధీరజ్ కొత్త చిత్రం 'పెక్ళియార్ సుళి'

చిత్రజ్యోతి

'డబుల్ టక్కర్' చిత్రంతో విజయాన్ని అందుకున్న యువ హీరో ధీరజ్.. 'పెక్ళియార్ సుళి' మూవీ ద్వారా మరో మారు ప్రేక్షకుల ముందుకురానున్నారు. మనోహరన్ పెరియతంబి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం చివరిదశ పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. ఈ యేడాదిలో విడుదలయ్యే మూవీని నిర్మాత సిలంబరసి.వి, ఎయిర్ ఫ్లిక్స్‌లు సంయుక్తంగా నిర్మించాయి ఒక బాల వికలాంగురాలి జీవిత చరిత్రను ఇతివృత్తంగా చేసుకుని ఆద్యంతం ఆసక్తికరంగా, ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా రూపొందిస్తున్నారు. ధీరజ్ సరసన అభినయ కథానాయికగా నటించారు. ఇతర పాత్రల్లో రేవతి, ఛైమ్‌గోపి, మాథ్యూ వర్గీస్, పవర్‌స్టార్ శ్రీనివాసన్, దర్శన్, జీవా రవి, పళనిదేవి, ఆర్జే మహాలక్ష్మి తదితరులు నటించారు. బాల నటులుగుఆ ఉన్ని కృష్ణన్, ఆర్ధా, ఫర్హానా, శ్రీశరవణ్‌లు నటించారు. ప్రసాద్ ఛాయాగ్రహణం అందించగా ఎస్ఆర్ హరి సంగీతం. ఈ సినిమా న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికై ఆఖరి రౌండ్‌లో చోటు దక్కించుకుంది.

'మళై పిడిక్కాద మనిదన్'గా విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ, శరత్ కుమార్ కలిసి నటించిన చిత్రం 'మళై పిడిక్కాద మనిదన్'. విజయ్ మిల్టన్ దర్శకుడు. సత్యరాజ్, డాలీ ధనుంజయ, మురళి శర్మ, మేఘా ఆకాష్, తలైవాసన్ విజయ్, శరణ్య పొన్‌వన్నన్, పృథ్వీ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరాలు కలిసి ఈ సినిమాను నటించారు. ఈ నెల 29వ తేదీన చిత్ర టీజర్‌ను విడుదల చేస్తామని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. వాస్తవానికి గత 2022లోనే ఈ చిత్రం విడుదలకావాల్సి ఉంది. కానీ, అనివార్య కారణాలతో జాప్యం జరిగింది. డయ్యూడామన్‌లలో చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఇందులో సీనియర్ నటుడు శరత్ కుమార్ ఓ కీలకమైన పాత్రను పోషించారు. సాధారణంగా విజయ్ ఆంటోనీ నటించే చిత్రాలన్నీ అతి తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేసుకుని విడులవుతుంటాయి. కానీ, ఈ సినిమా మాత్రం విడుదలయ్యేందుకు మూడేళ్ళకుపైగా సమయం పట్టింది.


'మళై పిడిక్కాద మనిదన్'లో విజయ్ ఆంటోనీ

నా దుస్తులు.. నా ఇష్టం : అనికా సురేంద్రన్



సోషల్ మీడియా వేదికగా తన వస్త్రధారణ గురించి కామెంట్స్ చేస్తున్న నెటిజన్లకు యువ నటి అనికా సురేంద్రన్ గట్టిగా కౌంటరిచ్చారు. నా దుస్తులు.. నా ఇష్టం.. నేను ఎలాగైనా ధరిస్తానంటూ సమాధానమిచ్చారు. అగ్రహీరో అజిత్ నటించిన 'విశ్వాసం' చిత్రంలో ఆయన కుమార్తెగా నటించిన అనికా.. ఇపుడు హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. అయినప్పటికీ కోలీవుడ్ ప్రేక్షకుల మనసుల్లో అజిత్ కుమార్తెగానే స్థిరపడిపోయారు. అదేసమయంలో ఆమె సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్నారు. ముఖ్యంగా గ్లామర్‌ను ఎక్స్‌పోజ్ చేసేలా దుస్తులు ధరిస్తూ, ప్రత్యేక ఫోటో షూట్‌లు చేస్తూ ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దీంతో నెటిజన్లు ఆమె మనసు గాయపడేలా కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనికా మాట్లాడుతూ, 'నాకు స్టైల్‌గా ఉండటం, మంచి దుస్తులు ధరించడం అంటే ఎంతో ఇష్టం. గ్లామర్ ఎక్స్‌పోజింగ్ చేసే దుస్తులు ధరించడం అనేది నా వ్యక్తిగతం. కానీ, ఎలాంటి దుస్తులు ధరించినా పలువురు విమర్శలు చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా చిత్ర పరిశ్రమలో ఇలాంటి విమర్శలు అధికంగా ఎదుర్కొంటున్నారు' అని పేర్కొన్నారు.

చియాన్ విక్రమ్‌ను డైరెక్ట్ చేయనున్న సుధా కొంగర!



'సూరరైపోట్రు' చిత్రం ద్వారా జాతీయ అవార్డును గెలుచుకున్న దర్శకురాలు సుధా కొంగర.. తన తదుపరి చిత్రంలో చియాన్ విక్రమ్‌ను డైరెక్ట్ చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం విక్రమ్ నటించిన 'తంగలాన్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉండగా, 'వీర ధీర సూరన్' చిత్రం షూటింగ్‌లో ఆయన బిజీగా ఉన్నారు. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటించేందుకు సమ్మతం తెలిపినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. సూర్య హీరోగా సుధా కొంగర తెరకెక్కించిన 'సూరరైపోట్రు' చిత్రం ఘన విజయం సాధించడంతో పాటు ఉత్తమ దర్శకురాలు, ఉత్తమ హీరో, ఉత్తమ హీరోయిన్, ఉత్తమ సంగీత దర్శకుడు ఇలా పలు విభాగాల్లో జాతీయ అవార్డులను గెలుచుకుంది. దీంతో సూర్య - సుధా కొంగరలు మరోమారు కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి 'పురాణనూరు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆ తర్వాత మదురైలోని అమెరికన్ కాలేజీలో షూటింగ్ కూడా ప్రారంభించారు. 1960లో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించేలా కథను సిద్ధం చేశారు. అయితే హీరో సూర్య ముంబైలో స్థిరపడి బాలీవుడ్ చిత్రాల్లో నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగా 'పురాణనూరు' ప్రాజెక్టు అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో సుధా కొంగర మరో కథను సిద్ధం చేసుకుని హీరోలు ధృవ్ విక్రమ్, శివకార్తికేయన్, చియాన్ విక్రమ్‌లకు వినిపించారు. ఇందులో విక్రమ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆయనతో కలిసి సుధా కొంగర చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టుపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన వెలువడనుంది.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా రెడ్డిచావిడి సమీపం సింగిరికుడిలో సుప్రసిద్ధ లక్ష్మనరసింహస్వామి ఆలయ రథోత్సవం బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము 4.30 గంటలకు నరసింహస్వామికి, తాయార్‌కు ప్రత్యేక తిరుమంజనం పూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతుడై సర్వాలంకరణ శోభితులై రథంపై ఉన్న ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమల రథోత్సవం ప్రారంభమైంది. రథానికి ఇరువైపులా ఉన్నా మోకుతాళ్ళను పట్టుకుని భక్తులు లాగారు. ఆలయ మాడవీధులలో ఊరేగిన తర్వాత రథం రథమండప ప్రాంతానికి తిరిగొచ్చింది. బుధవారం నరసింహ జయంతి కావటంతో వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏర్కాడులో వేసవి సంబరాలు ప్రారంభం

- సందర్శకులను ఆకట్టుకుంటున్న పుష్ప ప్రదర్శన


పూలతో రూపొందించిన ఈఫిల్ టవర్ నమూనాను తిలకిస్తున్న పర్యాటకులు

ప్యారీస్, మే 22: సేలం జిల్లాలోని ఏర్కాడు కొండలపై ఉన్న అన్నా పార్క్‌లో బుధవారం 47వ వార్షిక వేసవి ఉత్సవాలు, పుష్ప ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అపూర్వ బుధవారం ప్రారంభించారు. ఈనెల 26వ తేది వరకు కొనసాగనున్న పుష్ప ప్రదర్శనను కొలువుదీర్చిన పూల కళాఖండాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అన్నా పార్క్‌లో ఏర్పాటుచేసిన ఈఫిల్ టవర్, విండ్ మిల్, సముద్ర జీవరాశులు, పూల కళాఖండాలు, సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఈ కళాఖండాల ముందు నిలబడి ఆసక్తిగా సెల్ఫీ తీసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి వేడుకలను సేలం జిల్లా కలెక్టర్ డా.బృందాదేవి ప్రారంభించారు. గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రజలు, జానపద కళాకారులు, రైతులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేస్తున్నారు. అన్నా పార్క్ సమీపంలోని బోట్ హౌస్‌లో పడవలో విహరించేందుకు సందర్శకులు పోటీపడుతున్నారు. పుష్ప ప్రదర్శనలో 650 రకాలకు చెందిన రోజా పూలు, డబుల్ డిలైట్, మిల్కీవే, సిల్వర్‌లెనిన్ తదితర పూలరకాలు సువాసనలు వెదజల్లుతున్నాయి. అన్నా పార్క్ స్వాగత ద్వారం వద్ద, పరిసర ప్రాంతాల్లో పూలతో ఆర్చీలు ఏర్పాటుచేశారు. రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు సేలం, ఈరోడ్ తదితర జిల్లాల నుంచి ఏర్కాడుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి.


విండ్ మిల్ నమూనా


ముచ్చటగొలుపుతున్న పూల రకాలు


ఆల్చిప్ప ఆకారంలో పూల కళాఖండం


సముద్ర జీవరాశులు


చిన్నారులను ఆకట్టుకుంటున్న సీహార్స్

ఆకట్టుకుంటున్న భారీ అరటి గెల

పెరంబూర్, మే 22: నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో 1,000 పండ్లతో ఉంచిన భారీ అరటి గెల పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన 126వ పుష్ప ప్రదర్శన ఈ నెల 20వ తేదీతో ముగియగా, పర్యాటకుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 26వ తేది వరకు పొడిగించారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాలకు చెందిన లక్షల సంఖ్యలో పూలతో పలు రకాల డిజైన్లు ఏర్పాటుచేశారు. ఈ పార్క్‌లో ఏర్పాటుచేసిన వివిధ పూల కుండీల నడుమ 1,000 పండ్లు కలిగిన భారీ అరటి గెలను ఏర్పాటుచేశారు. పొడవాటి అరటి గెల ముందు పర్యాటకులు నిలబడి సెల్ఫీలు తీసుకుంటున్నారు.


ప్రదర్శనలో 1,000 పండ్లతో భారీ అరటి గెల

వెల్లివిరిసిన మత సామరస్యం

పార్వతి, పరమేశ్వరుడి కల్యాణానికి సారె అందించిన ముస్లింలు

పెరంబూర్, మే 22: దిండుగల్ శక్తి సంతాన వినాయకుడి ఆలయంలో నిర్వహించిన పార్వతి, పరమేశ్వరుడు స్వామివార్ల తిరుకల్యాణానికి ఆ ప్రాంతానికి చెందిన ముస్లింలు సారె అందజేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. దిండుగల్ నగర రౌండ్ రోడ్డు పుదూర్ ప్రాంతంలో వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని గత 2023లో పునరుద్ధరించి పార్వతి, పరమేశ్వరుడు, విష్ణు, దుర్గ, దక్షిణామూర్తి, చండీకేశ్వరుడు, కాలభైరవుడు తదితర దేవతామూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ ఏడాది మంగళవారం వర్షాభిషేకం జరిగింది. ఈ వేడులకు సంబంధించి ఆ ప్రాంతంలోని ఇస్లామీయులకు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం పంపారు. ఈ వేడుకల్లో భాగంగా పార్వతి, పరమేశ్వరుల తిరుకల్యాణం నిర్వహించగా, వధువు ఇంటి వారుగా పాల్గొన్న ఇస్లామీయులు 21 రకాలతో కూడిన సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు మంగళసూత్రం తాడును మార్చుకున్నారు.


సారె అందజేస్తున్న ఇస్లామీయులు

వైభవంగా స్వాతి నక్షత్ర హోమం

పెరంబూర్, మే 22: విల్లుపురం సమీపం పూవరసంకుప్పంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర ప్రత్యేక హోమం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. అనంతరం స్వామివారికి బంగారు కవచం ధరింపజేసి, దీపారాధనలు చేశారు. అనంతరం నరసింహ స్వామి, ధన్వంతరీ, హయగ్రీవుడు, కృష్ణుడు, రాముడు తదితర దేవతామూర్తుల పేరును జపిస్తూ స్వాతి హోమం నిర్వహించారు. సాయంత్రం తిరుకల్యాణం నిర్వహించారు. బుధవారం నరసింహ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




వెండి బాణం-విల్లును చూస్తున్న విజయేంద్ర సరస్వతి

అయోధ్య రామాలయానికి కానుకగా వెండి బాణం-విల్లు

కంచి శంకర మఠంలో ప్రత్యేక పూజలు

ప్యారీస్, మే 22: అయోధ్య రామాలయానికి కానుకగా సమర్పించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు తయారు చేయించిన వెండి బాణం-విల్లుకు కాంచీపురం శంకర మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రా భక్తులు 13 కిలోల వెండితో అందంగా తయారు చేయించిన బాణం-విల్లుతో మంగళవారం శంకర మఠంకు వెళ్లి మఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి వద్ద వాటిని అప్పగించారు. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆంధ్రా భక్తులను విజయేంద్ర సరస్వతి ఆశీర్వదించి అయోధ్యకు సాగనంపారు.

పట్టుబడిన మూడో చిరుత



పెరంబూర్, మే 22: తిరునల్వేలి జిల్లా పాపనాశం అటవీ రేంజ్ పరిధిలో వరుసగా మూడు చిరుత పులులు బంధించి అటవీ శాఖ సిబ్బంది, వాటిని సమీపంలోని అడవుల్లో వదిలిపెట్టారు. పాపనాశం రేంజ్ పరిధిలోని వెంబయాపురం, దాని చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో సంచరిస్తున్న చిరుత పులులు, ఆ ప్రాంత ప్రజలు పెంచుకుంటున్న మేకలు, వీధి కుక్కలను హతమారుస్తున్నాయి. ఈ చిరుతలతో ఎప్పుడు దాడి చేస్తాయో అని ఆ ప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో, చిరుత పులులను బంధించేందుకు వెంబయాపురం సహా పలు ప్రాంతాల్లో అటవీ శాఖ సిబ్బంది ఇనుప బోనులు ఏర్పాటు చేశారు. ఈ నెల 17వ తేది వెంబయాపురంలో ఏర్పాటుచేసిన బోనులో ఓ చిరుత పులి చిక్కింది. అలాగే, మంగళవారం ఆనవన్ జనావాస ప్రాంతంలో మరో చిరుత బోనులో చిక్కింది. ఈ నేపథ్యంలో, వెంబయాపురంలో ఏర్పాటుచేసిన బోనులో మరో చిరుత చిక్కడాన్ని బుధవారం ఉదయం అటవీ సిబ్బంది గమనించారు. ఈ చిరుతలను సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలినట్టు అధికారులు తెలిపారు.

సీతారామయ్య సేవలు చిరస్మరణీయం

స్మృత్యంజలి సభలో వక్తలు


కందనూరు సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు, శ్రీరామ్

ప్యారీస్, మే 22: వైద్య, సామాజిక సేవ, సాహిత్య రంగాల్లో డాక్టరు కందనూరు సీతారామయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు తండ్రి సీతారామయ్య వృద్ధాప్యం కారణంగా ఈ నెల 8వ తేదీన నగరంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో బుధవారం నిర్వహించిన స్మృత్యంజలి సభలో వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, దివంగత నటి సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, దివంగత నటి సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి, ఏచూరి చలపతిరావు, సనత్ కుమార్ రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్ర, శ్రీనివాసరాజు, ఏవీ శివకుమారి, రాధాలక్ష్మి తదితరులు సీతారామయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారు సీతారామయ్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఆయన సేవలు కొనియాడారు. ముందుగా జేకే రెడ్డి, అరుణా శ్రీనాథ్ అన్నమయ్య కీర్తనలు, భగవద్గీతలోని శ్లోకాలు శ్రావ్యంగా ఆలపించారు. ఏర్పాట్లను కందనూరు మధు, డా.శ్రీరామ్, కుటుంబసభ్యులు పర్యవేక్షించారు.

గరుడ సేవలో అపశ్రుతి

- పల్లకీ కర్ర విరిగి నేలకొరిగిన స్వామివారు
- ఇద్దరు భట్టాచార్యులకు గాయాలు

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరువొత్తియూరులోని కళ్యాణ వరదరాజ పెరుమాళ్ ఆలయంలో పదిహేడేళ్ల తర్వాత బుధవారం ఉదయం నిర్వహించిన గరుడ సేవలో అపశ్రుతి చోటుచేసుకుంది. భక్తుల దర్శనార్థం గరుడవాహనంపై ఆశీనులై బయలుదేరిన స్వామివారు ఆలయ ప్రధాన ద్వారం దాటక మునుపే నేలకొరిగారు. గరుత్మంతుడిపై స్వామిని, ఆ స్వామికి ఇరువైపులా కర్పూరనీరాజనాలు సమర్పించేందుకు నిలిచిన ఇద్దరు భట్టాచార్యులను మోసుకెళ్లేలా ఇరువైపులా లావుపాటి కొయ్యలు కలిగిన పల్లకీని ఆలయ శ్రామికులు మోసారు. ఇరువైపులా ఉన్న పల్లకీ కొయ్యలను భుజాలపై పెట్టుకుని బయలుదేరారు. ఈ గరుడ సేవను తిలకించడానికి అప్పటికే వేలాదిమంది భక్తులు ఆలయ ప్రవేశద్వారం వెలుపల బారులు తీరారు. ఇక కాసేపట్లో ఆలయ ప్రవేశద్వారం దాటుకుని స్వామివారు భక్తుల చెంతకు చేరనున్న సమయంలో ఉన్నట్టుండి ఆ పల్లకీ ఎడమవైపు కొయ్య విరిగింది. దీనితో స్వామివారు, ఇద్దరు భట్టాచార్యులు పక్కవాటుగా నేలకొరిగారు. ఈ ఘటనలో ఇద్దరు భట్టాచార్యులు గాయపడ్డారు. మురళీ అనే భట్టాచార్యుడికి తీవ్ర గాయాలు తగలడంతో ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు. ఊహించని ఈ ఘటనతో భక్తులంతా దిగ్భ్రాంతి చెందారు. స్వామివారి ఉత్సవ విగ్రహం నేలపై పడటంతో వెంటనే ఆలయ తలుపులను మూసివేశారు. ఆలయంలో శాంతి పూజలు జరిపిన తర్వాత మళ్ళీ స్వామివారు సర్వాలంకరణ శోభితులై గరుడవాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వీధులలో ఊరేగారు.


గరుడ వాహనంపై బయలుదేరిన స్వామివారు